క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ జయరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ-5, బీసీ-బీ 1, ఎస్టీ అభ్యర్థులకు ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలిగిన అభ్యర్థులు ఈ నెల 11 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పెదబొండపల్లి పీహెచ్‌సీ సందర్శన


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మజ్జి శోభారాణి

పార్వతీపురం టౌన్: మండలంలోని పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ మజ్జి శోభారాణి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఆమె మాట్లాడుతూ వైద్యులు పీహెచ్‌సీలో అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు వైద్యసేవలు అందించడంలో అలసత్వం వహించరాదని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జావీద్, సర్పంచ్ తవుడమ్మ, ఎమ్మార్‌నగరం సర్పంచ్ లక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం నిరసన

పాలకొండ రూరల్: పట్టణ పరిధిలో పారిశుధ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలని సీపీఎం నాయకుడు దావాల రమణారావు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నిరసన తెలిపారు. పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లు పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. డంపింగ్ యార్డు పూర్తికి చర్యలు తీసుకోవాలని, సంపూర్ణ పారిశుధ్య నిర్వహణతో ప్రజారోగ్య రక్షణకు బాటలు వేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా అడుగులు వేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కె.రాము, డి.దుర్గారావు, అర్జముడి లక్ష్మణరావు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి


చార్టులు ప్రదర్శిస్తున్న డిప్యూటీ ఈఓ లిల్లీరాణి


సీతంపేట: ఇక్కడ నేర్చుకున్న బోధనా పద్ధతులను పాఠశాలల్లో పక్కాగా అమలు చేయాలని తద్వారా నాణ్యమైన విద్యను అందించాలని డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో భౌతికశాస్త్ర, జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఇస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్న ఆమె మాట్లాడారు. విద్యార్థులకు అర్థవంతమయ్యే విధంగా బోధన జరగాలన్నారు. అనంతరం చార్టులను ప్రదర్శించారు. కార్య క్రమంలో ఏఎంఓ పి.కోటిబాబు, సీఎంఓ చిరంజీవి, జీసీడీఓ రాములమ్మ, డీఆర్పీలు పాల్గొన్నారు.

పీజీ కళాశాల ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పాలకొండ రూరల్: నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసిస్తున్న నేపథ్యంలో పాలకొండలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ బాలికల విభాగం రాష్ట్ర కన్వీనర్ సీహెచ్ పావని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో చేపట్టిన సైకిల్ యాత్రనైదో రోజు శుక్రవారం పాలకొండ చేరింది. ఈ సందర్భంగా స్థానికంగా విద్యార్థులతో సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పండు, రాజశేఖర్, కె.రాజు, సింహాచలం పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో ఉత్తమ ఫలితాలు


వైద్యతనిఖీలు చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

రేగిడి: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఆయుర్వేద మందులను వినియోగించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని ప్రభుత్వ ఆయుర్వేద కేంద్రం వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. ఖండ్యాం గ్రామంలో శుక్రవారం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 52 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. ఆయుర్వేద మందులు వినియోగించడం వల్ల ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్ ఉండవన్నారు. కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ, శైలజ, ఏఎన్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యకు
ఇంటి వద్దనే పరిష్కారం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు


బలిజిపేట: వైద్య శిబిరంలో వృద్ధుడికి కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: ప్రజలు తమ ఆరోగ్య సమస్యలపై ఎటువంటి ప్రయాస పడకుండా గ్రామాల్లో ఇంటివద్దనే తెలుసుకుని వైద్యసేవలు పొందడమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం సీతానగరం మండలంలోని వెంకటాపురంలో పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నఆరోగ్య సురక్ష ఉచివైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరికీ ఆరోగ్య భద్రత కల్పించడానికి జగనన్న ప్రభుత్వం కల్పించిన ఉచితవైద్యశిబిరాలను వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలోభాగంగా ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ)అధికారి టి. జగన్‌మోహన్‌రావులు ప్రతి కౌంటర్‌లో అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. సర్వే సమయంలో ఇళ్లలో లేనివారికి వైద్యశిబిరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఓపీ కూపన్లు అందజేశారు. వైద్యశిబిరంలో 350 మందికి వైద్యసేవలు అందించామని వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వి.నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి. శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజు, సర్పంచ్ బి.శ్రీనివాసరావు మాజీ సర్పంచ్ గౌరునాయుడు, పార్టీ నాయకులు ముకుందరావు, గోపాలనాయుడు, రౌతు రాము, చెల్లన్నాయుడువలస సర్పంచ్ వి.అప్పమ్మ, మాజీ ఎంపీటీసీ డి.నాగరత్నం, సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకునేందుకే..

బలిజిపేట: అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి కుటుంబాన్ని ఆదుకునేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. బలిజిపేట మండలం తుమరాడలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో 7రకాల పరీక్షలు నిర్వహించి అందుకు తగిన వైద్య సేవలు అందించనున్నారని తెలిపారు. అవసరమైతే బాధితులను పెద్దాస్పత్రులకు రిఫర్ చేసి వైద్యసేవలు అందించనున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 406మందికి 40మంది వైద్యులు సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కనక మహాలక్ష్మి, కె.లక్ష్మణరావు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎంపీడీఓ విజయలక్ష్మి, డీటీ రత్నకుమారి, వైద్యాధికారులు శేఖర్, శివగాయత్రి, సందీప్‌కుమార్, శ్రావణ్‌కుమార్, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.


సీతానగరం: రక్త పరీక్షలను పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ జగన్‌మోహనరావు, ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి


బలిజిపేట: వైద్యులనుంచి వివరాలు తెలుసుకుంటున్న జమ్మాన

ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకం

బలిజిపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఏపీ టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని తుమరాడలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన రోగుల వివరాలు, వారికి తగిన విధంగా వైద్యసేవలు అందుతున్నాయా అని అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడేవారు ఉంటే అటువంటి వారికి ఉచితంగా వైద్యసేవలు అందించేందుకే ఈ పథకం ప్రవేశపెట్టారని, దానికి అనుగుణంగా వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకమహాలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలి


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకువెళ్లి, ప్రతి ఒక్కరికీ ఏదో రూపంలో సంక్షేమ పథకాలు అమలు చేసిన విషయాన్ని అందరికీ తెలియజేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు కృషి చేద్దామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ఆంధ్రాబ్యాంక్ భవనం మేడపైన మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టి రాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల ప్రచారం కార్యక్రమాలను ద్వితీయ శ్రేణి నాయకులు ఇనుమడించుకుని అమలు చేయాల్సి ఉందని చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వి.నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.శ్రీరాములునాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలోని సీతానగరం మండలంలోని జగనన్నకు ఆదరణ రోజురోజుకూ పెరుగుతోందని, ఎమ్మెల్యే అలజంగి జోగారావు నిరంతరం పార్టీ కోసం చేస్తున్న శ్రమతో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని విజయపథంలో నడిపించడానికి అందరినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం బాబ్జీ, జెడ్పీటీసీ మాజీ సభ్యులు అంబటి కృష్ణంనాయుడు, టి.వెంకటప్పలనాయుడు, పి ఈశ్వరనారాయణ, ఎస్ రామకృష్ణ, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు,సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలి


మహా పాదయాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

పాలకొండ రూరల్: రానున్న శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర నాయకుడు అలజంగి చిన్నారావు అన్నారు. స్థానిక కస్పావీధిలో జిల్లా విశ్వరూప మహా పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను పాలకొండ నియోజకవర్గ అధ్యక్షుడు లోపింటి జడ్డియ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కొరటాల రవి, కార్యదర్శి పుట్టా భీమేశ్వరరావులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ నేతృత్వంలో ఈ నెల 7 నుంచి తమ డిమండ్ల సాధనకు అలంపూర్ నుంచి మాదిగల విశ్వరూప పాదయాత్ర ప్రారంభించటం జరుగుతుందన్నారు. నవంబర్ 7వ తేదీన హైదరాబాద్‌లో మహాసభ జరుగుతుందని తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ కోశాధికారి పుష్పనాథ, బోగి జేమ్స్, గుంట మోహన్, యందవ మరియ దాసు, పకీరు, విశ్వేశ్వరరావు, జి.రమేష్, కె.గోపి, సుధీర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు రక్ష

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు రక్షణ కలుగుతుందని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పాచిపెంట మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలలో 14 రకాల పరీక్షలు, 174 రకాల మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. నవంబర్ పదో తేదీ వరకు వైద్యశిబిరాలు జిల్లాలో నిర్వహిస్తారన్నారు.

ప్రతి ఇంటికీ వలంటీర్లు, వైద్యసిబ్బంది వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను గుర్తించి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. పేదవానికి రోగం శాపం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సాధారణ రోగాలకు అక్కడికక్కడే వైద్యసేవలు అందించి, దీర్ఘకాలిక సమస్యలుంటే ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తారని చెప్పారు. ప్రజల ఆరోగ్య విషయంలో ముఖ్యమంత్రి రాజీ పడకుండా వైద్య చికిత్సల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. అలాగే పలువురు గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ శివకుమార్, వైద్యాధికారి వెంకటరమణ, ప్రజాప్రతినిధులు, నాయకులు డోల బాబ్జి, తట్టికాయల గౌరీశ్వర రావు, మర్రి ఉమామ హేశ్వరరావు, కొండలరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మరిపల్లిలో..

మండలంలోని మరిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరారం నిర్వహించారు. ఈ శిబిరంలో 371 మందిని, కర్రివలసలో 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పార్వతి, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఎంపీటీసీ సభ్యుడు జన్ని సీతారాం, పార్టీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్ శ్రీనివాస్, నాయకులు దండి శ్రీనివాసరావు, కాగాన పోలినాయుడు, ప్రజాప్రతినిధులు, అధికారులు , నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మరిపల్లిలో మందులు అందజేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఇంటింటా సర్వే


అట్టలిలో ఆరోగ్య సర్వే

పాలకొండ రూరల్: ప్రజల ఆరోగ్య రక్షణ ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని అట్టలి సర్పంచ్ కనుముల సంధ్యారాణి అన్నారు. తమ సచివాలయ పరిధిలో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఇంటంటా సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వైద్య బృందాలతో వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేయించారు. ప్రభుత్వం ఉచితంగా ఇంటివద్దనే పలు రకాల వైద్య పరీక్షలు చేయించి, మెరుగైన వైద్యసేవలు అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షరాలు కె.కల్పన, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, కార్యదర్శి రాంబాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆచరణాత్మక ప్రణాళికతో విజయం

గుమ్మలక్ష్మీపురం: ఆచరణాత్మక ప్రణాళికలతో ముందుకెళ్తే విజయం దక్కుతుందని పార్వతీపురం మన్యం జిల్లా జాతీయ ఉపాధి సేవా, యంగ్ ప్రొఫెషనల్ సంస్థ కో ఆర్డినేటర్ జి.అజయ్‌కుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిగా ఉంటూ విద్యానంతరం ఎలాంటి ఉపాధి అవకాశాలు పొందాలో వివరించారు. నేషనల్ కెరీర్ ఆపర్చ్యునిటీలో భాగంగా విద్యార్థులకు అనేక ఉపాధి, శిక్షణ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ


పలగర పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: మండలంలోని పలగర పాఠశాల రికార్డులను, విద్యార్థుల ప్రమాణాలను, మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ-1 సామల సింహాచలం శుక్రవారం పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు విద్యాసంవత్సరంలో పాఠశాలల తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. తనిఖీ సందర్భంగా పాఠశాల నిర్వహిస్తున్న రికార్డులు, పాఠశాలకు సంబంధించి నాడు-నేడు పనుల రికార్డులు, పాఠశాల పరిసరాలు, విద్యార్థుల స్థాయి, నైపుణ్యాలు, మధ్యాహ్నభోజన పథకం అమలు, విద్యార్థులకు కలుగుతున్న అసౌకర్యాలపై, తల్లిదండ్రులతో సంప్రదింపులు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏ పాఠశాల తనిఖీ సందర్భంగా అయినా పాఠశాలకు సంబంధించి ఉండాల్సిన రికార్డులు ప్రధానోపాధ్యాయులు సరిచేసి ఉంచాలని సూచించారు. తనిఖీలు నిర్వహించి సంబంధించిన వివరాలను జిల్లా అధికారులకు పంపించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనచోదకులు జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ

సీతానగరం: ప్రభుత్వం నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు జాగ్రత్తలు పాటించాలని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో విద్యార్థులు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్ అధ్యక్షతన జిల్లా కేంద్రాస్పత్రి డాక్టర్ నారాయణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోటారు వాహనాలు నడిపే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలుసుకోవాలని హితవు పలికారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స ఏవిధంగా చేయాలో విద్యార్థులకు డాక్టర్ నారాయణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు డి.రామకృష్ణ, బి.రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులంతా ఈకేవైసీ చేయించాలి


మాట్లాడుతున్న జిల్లావ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్


బలిజిపేట: అంపావల్లిలో బయోమెట్రిక్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ శ్రావణ్

- జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్

సీతానగరం: వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న ఈకేవైసీ గడువు ముగియనున్నందున రైతులందరూ వారి పొలాల్లో సాగు చేస్తున్న పంటలకు ఈకేవైసీ విధిగా చేయించి వ్యవసాయ సిబ్బందికి సహకరించాలని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆర్.వెంకంపేట, కాశీపేట, చినభోగిలి, రెడ్డివానివలస గ్రామాల్లో ఏఓ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్.వెంకంపేటలో రచ్చబండ వద్ద రైతులంతా ఈ క్రాప్ ప్రక్రియ ముగిసిన వెంటనే అదే భూమిలో ఈకేవైసీ చేయించుకోవాలని ఊరూరా గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది నిరంతరం తిరుగుతున్నా అంతగా స్పందించక పోవడంతో ఆలస్యమవుతోందన్నారు. ప్రభుత్వం నిబంధనలను పరిగణనలోకి తీసుకుని రైతులు పండించిన పంటలకు ఈకేవైసీ చేయించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జోరుగా ఈకేవైసీ

బలిజిపేట: రైతులు వేసిన పంటకు బయోమెట్రిక్ వేసి ఆమోదించుకోవాలని ఏఓ శ్రావణ్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని అంపావల్లిలో శుక్రవారం నిర్వహించిన బయోమెట్రిక్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రైతులు వేసుకున్న పంట ఈ-క్రాప్ కాకపోతే వెంటనే చేయించుకోవాలని కోరారు. పంట రకం, విత్తిన తేదీ, నీటి పారుదల సౌకర్యాలు, తదితర అంశాలు నమోదు చేస్తారన్నారు. పంట నమోదైన తరువాత ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ క్రాప్ ఆధారంగా పంట విక్రయించుకునే వీలుంటుందని చెప్పారు. ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ రాయితీ, ప్రభుత్వ పథకాలు అమలవుతాయని చెప్పారు. పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జీగిరాం జూట్ ఫ్యాక్టరీ తెరిపించండి


ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను కలిసిన కార్మిక సంఘ నాయకులు

సాలూరు: మండలంలోని జీగిరాం జూట్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు న్యాయం చేయాలని పలువురు కోరారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను శుక్రవారం ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, ఫ్యాక్టరీ తెరిపించాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ విశాఖపట్నం, కార్మిక శాఖా మంత్రి గుమ్మనూరు జయరాం, కార్మిక శాఖ కమిషనర్, సెక్రటరీ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లకు ఫోన్‌లు, లేఖల ద్వారా కోరినా ఫలితం లేకపోయిందన్నారు. ఫ్యాక్టరీ మూతపడడంతో సుమారు 1200 మంది కార్మికులు 16 నెలలుగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. దీనికి మంత్రి రాజన్నదొర స్పందిస్తూ, ఈ నెల 17,18 తేదీలలో విజయవాడలో కార్మికశాఖా మంత్రి, కమిషనర్‌లను కలిసి మాట్లాడతానని హామీ ఇచ్చారు.

అధికారులు స్పందించాలి

పాలకొండ రూరల్: గిరిజన సమస్యల పరిష్కారం పట్ల అధికారులు అంకితభావంతో స్పందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు అన్నారు. గుమలక్ష్మీపురం మండలానికి చెందిన గిరిజనులు సీపీఐ ఆధ్వర్యంలో పాలకొండ ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమలక్ష్మీపురం మండలంలో పలువురు గిరిజనులు ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజనులు తమ సమస్యలపై అధికారులకు విన్నవించినా ఎటువంటి ప్రయోజనం ఉండడం లేదన్నారు. పలుమార్లు జిల్లా అధికారులకు సమస్యలు విన్నవించినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందన్నారు. తక్షణమే అర్హులకు ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు తోట జీవన్, గురుబిల్లి సూరయ్య, కూరంగి గోపి పాల్గొన్నారు.